కమ్ముకున్న పొగమంచు

పట్టణంలో ఉదయం ఉన్న పొగమంచు

మెట్‌పల్లి పట్టణంలో ఆదివారం ఉదయం పొగమంచు కమ్ముకున్నది. 8 గంటల వరకు కూడా చీకటిగా ఉండడంతో వాహనదారులకు రోడ్డు సరిగ్గా కనిపించక లైట్లు వేసుకొని వాహనాలు నడిపారు. ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రాలేదు.

–మారుతీనగర్, డిసెంబర్ 8

కాంగ్రెస్‌లో వర్గపోరు..!

- మల్లాపూర్‌లో రెండు పార్టీ కార్యాలయాల ఏర్పాటు
- అయోమయంలో కాంగ్రెస్ శ్రేణులు

మల్లాపూర్, డిసెంబర్ 8: మండలంలో కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, టీపీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు మధ్య వర్గపోరు నడుస్తున్నది. గత మార్చిలో జువ్వాడి నర్సింగరావు ప్రధాన అనుచరుడు మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ వద్ద కాంగ్రెస్ మండల కార్యాలయాన్ని ఏర్పాటు చేయగా, జువ్వాడి నర్సింగరావు ప్రారంభించారు. ఇప్పటి వరకు కార్యాలయం ద్వారా కార్యకర్తల సమస్యలు, పార్టీ పరమైన సమావేశాలను జువ్వాడి అనుచరులు కొనసాగిస్తున్నారు. కాగా, ఈనెల 7న కల్వకుంట్ల సుజిత్‌రావు ప్రధాన అనుచరుడు, పాతదాంరాజ్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొమ్ముల చిన్నారెడ్డి ఆధ్వర్యంలో నంది చౌరస్తాకు వెళ్లే మార్గంలో కాంగ్రెస్ మండల కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కార్యాలయాన్ని కల్వకుంట్ల సుజిత్‌రావు చేతుల మీదుగా ప్రారంభించడంతో ఒక్కసారిగా పార్టీలో వర్గ విభేదాలు మొదలయ్యాయి. ఒకే పార్టీకి రెండు మండల కార్యాలయాలు ఏమిటోనని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు. ఈ వర్గపోరు గ్రామాల్లో సైతం కాంగ్రెస్ కార్యకర్తల్లో స్పష్టంగా కనిపిస్తున్నది. అలాగే, ఇటీవల వెల్లడైన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుల ఫలితాలు సైతం రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. ఈ ఎన్నికల్లో చాప కింద నీరులా సుజిత్‌రావు అనుచరుడు రేగుంట గ్రామానికి చెందిన నిమ్మల రాజు యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా గెలుపొందడం విశేషం. గ్రామాల్లోని కాంగ్రెస్ శ్రేణులు మాత్రం ఇలాంటి వర్గపోరుతో పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు గడ్డు పరిస్థితులే మిగులుతాయని చర్చించుకుంటున్నారు.

ఆలయ పరిసరాల్లోని పొలాల్లో బోనాలు వండుతున్న భక్తులు

బోనాలతో ఆలయానికి వస్తున్న భక్తులు

భక్తజన సంద్రమైన మల్లన్నపేట

గొల్లపల్లి, డిసెంబర్ 8: మండలంలోని మల్లన్నపేట గ్రామం ఆదివారం భక్త జనసంద్రంగా మారింది. షష్ఠి ఏడు వారాల మల్లన్న జాతరలో భాగంగా స్వామి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. స్వామి వారి దర్శనానికి సుమారు 4 గంటల సమయం పట్టగా, ప్రత్యేక దర్శనం లైన్లలో నిల్చున్న భక్తులకు రెండు గంటల సమయం పట్టింది. భక్తులు బోనాలు వండి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు నిజామాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల నుంచి సుమారు 30 వేల మంది భక్తులు వచ్చారు. ప్రత్యేక దర్శనం, పట్నాల టికెట్ల విక్రయాల ద్వారా ఆలయానికి రూ. 70,010 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య, ఈవో విక్రమ్ తెలిపారు. గొల్లపల్లి ఎస్ఐ సతీశ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గొల్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ర్యాలీ తీస్తున్న సీపీఎం నాయకులు నాగయ్య, బాలకృష్ణ, తదితరులు

కోరుట్ల, డిసెంబర్ 5: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఎం నిరంతర పోరాటాలు చేస్తుందని పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య అన్నారు. పట్టణంలోని సినారె కళాభవనంలో ఆదివారం నిర్వహించిన పార్టీ జిల్లా మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నాయన్నారు. కేంద్రంలో మోదీ సర్కార్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్‌ఐసీ, రైల్వే, విమాన రంగం, విశాఖ స్టీల్ ప్లాంట్, సింగరేణి వంటి ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నదని ఆరోపించారు. అంతకుముందు స్థానిక కొత్త బస్టాండ్ నుంచి సినారె కళాభవనం వరకు నాయకులు ఎర్రజెండాలతో ర్యాలీ తీశారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు బాలకృష్ణ, శ్రీకాంత్, సుందర్, జిల్లా కన్వీనర్ తిరుపతి నాయక్, జిల్లా కమిటీ సభ్యులు ఎంఏ దరి, సులోచన, శారద, భగత్, భూషణ్, ప్రజా సంఘాల నాయకులు రమేశ్, సురేశ్, పద్మ, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుధ్య పనులు

మెట్‌పల్లి, డిసెంబర్ 8: పట్టణంలోని పలు వార్డుల్లో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. రహదారులు, డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేశారు. పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ మోహన్ పర్యవేక్షించారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది రత్నాకర్, ముజీబ్, నిజామొద్దీన్ తదితరులున్నారు.

మహిళలకు జూట్ బ్యాగుల పంపిణీ

మహిళా సంఘం సభ్యురాళ్లకు జూట్ బ్యాగులు అందజేస్తున్న కౌన్సిలర్ పద్మారాజిరెడ్డి

కోరుట్ల, డిసెంబర్ 8: పట్టణంలోని 16వ వార్డులో ఆదివారం కౌన్సిలర్ బలిజ పద్మారాజిరెడ్డి మహిళా సంఘాల సభ్యురాళ్లకు జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్ కవర్లను వినియోగించవద్దని కౌన్సిలర్ సూచించారు. ఇక్కడ ఆర్పీ పావనీ, మహిళా సంఘాల ప్రతినిధులు తుక్కమ్మ, కాశమ్మ, లావణ్య తదితరులున్నారు.

పీఆర్సీ బకాయిలు చెల్లించాలి

ధర్మపురి రూరల్, డిసెంబర్ 8: పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని తపస్ రాష్ట్ర అధ్యక్షుడు కాసుగంటి హనుమంతరావు డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీ బకాయిలను విడుదల చేయాలని కోరుతూ ఈనెల 17న తపస్ ఆధ్వర్యంలో ధర్మదీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఆదివారం ఆయన ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 317 జీవో ద్వారా నష్టపోయిన ప్రతి ఉద్యోగికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి రొట్టె శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు బండి మహేశ్, జిల్లా కార్యదర్శి రమేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజేశ్ తదితరులున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

జగిత్యాల రూరల్, డిసెంబర్ 8: మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన కుంట వేణు, ఆంజనేయులు రోడ్డు ప్రమాదంలో గాయపడి జగిత్యాలలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ దవాఖానకు వెళ్లి గాయపడిన వారిని పరామర్శించి, ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే, బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లి గ్రామానికి చెందిన పూడూరి విజయ్, బర్ల రోహిత్ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇదే దవాఖానలో చికిత్స పొందుతుండగా వారిని పరామర్శించి, ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు.

యాదవులంతా ఐక్యంగా ఉండాలి

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 8: యాదవులంతా ఐక్యంగా ఉండాలని అఖిల భారత యాదవ మహాసభ యూత్ జిల్లా అధ్యక్షుడు రెబ్బటి రాజశేఖర్ యాదవ్ కోరారు. కోమటికొండాపూర్‌లోని యాదవ సంఘ భవనంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొందరు యాదవ సంఘం పేరు చెప్పుకొని డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వారిని యాదవులు నమ్మవద్దన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రెబ్బాసి మధుయాదవ్, రాజేశ్వర్‌యాదవ్, సాగర్‌యాదవ్, అశోక్‌యాదవ్, వినయ్‌యాదవ్, రాం, వంశీ, రంజిత్, యాదవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేకుల షెడ్డుపై నుంచి జారి పడి యువకుడి మృతి

కోరుట్ల, డిసెంబర్ 8: పట్టణంలోని హాజీపురా కాలనీకి చెందిన మహ్మద్ హాజీ (30) రేకుల షెడ్డుపై నుంచి ప్రమాదవశాత్తు జారి పడడంతో మృతి చెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని హాజీపురా కాలనీకి చెందిన మహ్మద్ హాజీ పట్టణ శివారులోని సాయిబాబా ఆలయ సమీపంలో ఓ రేకులషెడ్డుపై ఆదివారం రేకులను బిగిస్తున్నాడు. ఈక్రమంలో బిగించని రేకుపై అనుకోకుండా కాలు వేశాడు. దీంతో పై కప్పు నుంచి కింద పడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన తోటి కార్మికులు దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మహ్మద్ హాజీ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రుణమాఫీలో కేంద్రం బాధ్యతను విస్మరించడం సరికాదు

జగిత్యాల, డిసెంబర్ 8: పంట రుణమాఫీ విషయంలో రాష్ట్రానికే బాధ్యత ఉంటుందా..? కేంద్రానికి బాధ్యత లేదా అని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.? జగిత్యాలలోని ఇందిరాభవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, యూపీఏ హయాంలో పంట రుణ మాఫీ విషయంలో కేంద్రమే బాధ్యత తీసుకుందని, కానీ బీజేపీ ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పుకుంటున్నదని విమర్శించారు. రైతు బిడ్డను పోలి ఉండేలా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించినట్లు చెప్పారు. మహిళల సంక్షేమం కోసం తెలంగాణలో అనేక పథకాలు అమలు చేస్తున్నామని, దేశంలో మీరెక్కడైన అమలు చేస్తున్నారో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా చెప్పాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షులు కొత్త మోహన్, జగిత్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీరం రాజేశ్, బండ శంకర్, కౌన్సిలర్లు దుర్గయ్య, నక్క జీవన్, నాయకులు జున్ను రాజేందర్, గుండా మధు, తాటిపర్తి పరిక్షిత్ రెడ్డి, రాజేందర్, రమేశ్ బాబు, మధుకర్ రెడ్డి, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి కోసమే ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్న

జగిత్యాలరూరల్: గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, తదితరులు

జగిత్యాల రూరల్, డిసెంబర్ 8: జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి కోసమే ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, లక్ష్మీపూర్ నుంచి గుట్రాజ్‌పల్లి, కల్లెడ వరకు బీటీ రోడ్డు మంజూరు కాగా, పనులు చివరి దశలో ఉన్నట్లు తెలిపారు. మహిళా సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘం భవనాలకు నిధులు మంజూరు చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సందీప్ రావు, మాజీ ప్రజాప్రతినిధులు మహేశ్వర్ రావు, పరశురాం గౌడ్, రాజన్న, రామచంద్రం, గంగాధర్, బాల ముకుందం, నక్కల రవీందర్ రెడ్డి, నారాయణ రెడ్డి, దమ్మ సురేందర్ రెడ్డి, శ్రీనివాస్, రమేశ్, అంజి, మల్లేశ్, సురేశ్, శ్రీనివాస్, ఎంపీవో రవి, ఏఈ రాజమల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్, డిసెంబర్ 8: రాజకీయాలు ఎన్నికల వరకే అని అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. బీర్‌పూర్‌లో పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలో కొత్తగా 21 పల్లె దవాఖానలు మంజూరైనట్లు తెలిపారు. బీర్‌పూర్ మండల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు, జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

మాట్లాడుతున్న తపస్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య

జగిత్యాల టౌన్, డిసెంబర్ 8: రాష్ట్రంలో ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి దేవయ్య, బోయినపల్లి ప్రసాద్‌రావు డిమాండ్ చేశారు. స్థానిక గీతా గ్రంథాలయంలో ఆదివారం తపస్ జగిత్యాల జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగులు తమ అవసరాలకు దాచుకున్న జీపీఎస్ సంపాదిత సెలవుల మొత్తం, రిటైర్మెంట్ బెన్‌ఫిట్లు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, తదితర బిల్లులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అయిల్నేని నరేందర్‌రావు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లకు ప్రభుత్వం స్పందించి వెంటనే బిల్లులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకుడు ఎలిగేటి రాజేంద్రప్రసాద్, జిల్లా ప్రచార కార్యదర్శి జీవీ రామకృష్ణ, మహిళా నాయకురాలు భాగ్యలక్ష్మి, ఆయా మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

దత్త జయంతి వేడుకలు

ఆలయంలో అష్టదశ కలశ పూజ చేస్తున్న అర్చకులు

కోరుట్ల, డిసెంబర్ 8: పట్టణంలోని సాయిరామ ఆలయంలో ఆదివారం దత్త జయంతి వేడుకలు నిర్వహించారు. ఆలయంలో దత్తాత్రేయుడు, సాయినాథుడికి ప్రత్యేక పూజలు, అభిషేకార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కాంతారెడ్డి, అర్చకులు, ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

ధర్మపురి, డిసెంబర్ 8: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఆలయమైన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో గల దత్తాత్రేయ స్వామికి దత్తాత్రేయ నవరాత్రోత్సవాల సందర్భంగా రుద్రాభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రాజగోపాల్, విశ్వనాథశర్మ, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవస్వామికి ప్రత్యేక పూజలు

కోరుట్ల రూరల్, డిసెంబర్ 8: చిన్నమెట్‌పల్లి శివారులోని కాలభైరవ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలభైరస్వామిని వేదపండితుడు చక్రపాణి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించి, సామూహిక అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి మార్కండేయ పురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞం

కోరుట్ల, డిసెంబర్ 8: పట్టణంలోని పద్మశాలీ కల్యాణ భవనంలో పద్మశాలీ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మార్కండేయ పురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞం సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు పోపా ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శృంగేరీ శారద పీఠ ఆస్థాన పౌరాణికులు గర్రిపల్లి మహేశ్వర శర్మ వైదిక నిర్వహణలో సాయంత్రం 6 నుంచి 7.30 గంటల వరకు ప్రవచనాలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

బోనాల పండుగ

మల్లాపూర్, డిసెంబర్ 8: రత్నాపూర్‌లోని మల్లికార్జునస్వామి ఆలయంలో షష్టి మాసం పురస్కరించుకొని భక్తులు బోనాల పండుగ నిర్వహించారు. ఆలయంలో పురోహితుడు శివకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి భక్తులు బోనాలు వండి, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇక్కడ ఆలయ, వీడీసీ కమిటీ సభ్యులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడా పోటీలు

రాయికల్, డిసెంబర్ 8: అల్లీపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం గ్రామీణ క్రీడా పోటీలను అధికారులు ప్రారంభించారు. మొదటి రోజు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కోరుకంటి రవికుమార్, మాజీ ఎంపీటీసీ మోర విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణప్రసాద్, కోటేశ్వరరావు, పంచాయతీ సెక్రటరీ శేఖర్, మిట్టపల్లి రాజేందర్, వేముల సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాల, డిసెంబర్ 8: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం సీఎం కప్ గ్రామ స్థాయి క్రీడా పోటీలు ఆదివారం రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను మండల స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పీడీ రాజమల్లయ్య, ఉపాధ్యాయులు ఏనుగు ఆదిరెడ్డి, క్రీడాకారులు కృష్ణంరాజు, కృష్ణమోహన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల అభివృద్ధికి కృషి చేస్తా

జగిత్యాల, డిసెంబర్ 8: జగిత్యాల పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని 41వ వార్డులో డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆదివారం ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతితో కలిసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, కౌన్సిలర్ కప్పల శ్రీకాంత్, ఏఈ శరన్, వార్డు నాయకులు నారాయణ, పెద్దింటి రాజు, మల్లేశ్, రమేశ్, మనోహర్, గంగారాం, దేవయ్య, మర్రిపెల్లి శ్రీనివాస్, కౌన్సిలర్లు పిట్ట ధర్మరాజు, పంబాల రాంకుమార్, చుక్క నవీన్, బొడ్ల జగదీష్, నాయకులు దుమాల రాజ్‌కుమార్, డిష్ జగన్, గిరి, పవన్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

రేపు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సమావేశం

జగిత్యాల, డిసెంబర్ 8: అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఈనెల 10న జిల్లా కేంద్రంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌జీవో) సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎన్‌జీవో సభ్యుడు అయిల్నేని శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ సంస్థ ద్వారా సామాన్య ప్రజలకు మరింత సేవలందించడానికి తెలుగు రాష్ట్రాల ప్రముఖులు మాడభూషి శ్రీధర్, సతీశ్‌చంద్ర, సుబ్బారావు, లక్ష్మారెడ్డితో సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హ్యూమన్ రైట్స్, ఆర్‌టీఐ యాక్ట్‌పై అవగాహన కల్పిస్తారని తెలిపారు.

పేద యువతి వివాహానికి ఆర్థిక చేయూత

రుచితకు నగదు అందజేస్తున్న పద్మశాలీ సేవా సమితి సభ్యులు

జగిత్యాల, డిసెంబర్ 8: మేడిపల్లి మండలం వల్లంపల్లికి చెందిన పేద యువతి రుచిత వివాహానికి శ్రీ భక్త మార్కండేయ యువజన స్వచ్ఛంద సేవా సమితి ద్వారా రూ. 10 వేల నగదు అందజేశారు. గీతా సిల్క్ హౌస్ అధినేత కస్తూరి శశిధర్ పెండ్లి చీర అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆకుబత్తిని శ్రీనివాస్, చిలుకమారి శ్రీనివాస్, అనుమల్ల శ్రీనివాస్, కోమాకుల సుదర్శన్, వేముల శంకర్, పద్మశాలీ సేవా సంఘం డైరెక్టర్ జోగ మల్లేశం, మాచర్ల శంకర్, గాజంగి భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

మాజీ సర్పంచ్ నర్సయ్యను పరామర్శిస్తున్న మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ బాపురెడ్డి, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు హరిచరణ్‌రావు

మేడిపల్లి, డిసెంబర్ 8: భీమారం మండలం గోవిందారం మాజీ సర్పంచ్ తోకల నర్సయ్య తల్లి నర్సు మృతి చెందారు. నర్సయ్యను ఆదివారం మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు పరామర్శించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సత్తిరెడ్డి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు తదితరులున్నారు.

యువత సమస్యల పరిష్కారానికి కృషి

పెగడపల్లి, డిసెంబర్ 8: తనను ఆదరించి ఎమ్మెల్సీగా గెలిపిస్తే యువత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వేముల కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పెగడపల్లిలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం తన మద్దతుదారులతో కలిసి బైక్ ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రం జీవన్‌రెడ్డి, జొన్నల కరుణాకర్‌రెడ్డి, పన్నాల మహేందర్, మానుపాటి వెంకటేశం, నెత్తట్ల రాజేశ్, వినయ్, పన్నాల కిరణ్‌కుమార్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ప్రజల ఇక్కట్లు

పెగడపల్లిలోని మిషన్ భగీరథ నీటి సంపు

పెగడపల్లి, డిసెంబర్ 8: మండలంలో పక్షం రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో పెగడపల్లి మండలంతో పాటు గొల్లపల్లి మండలానికి చెందిన 2 గ్రామాల ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తాగు నీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. కాగా, ఈ విషయమై మిషన్ భగీరథ డీఈ మురళిని వివరణ కోరగా డబ్బా వద్ద మిషన్ భగీరథ పథకానికి సంబంధించిన మోటర్లు చెడి పోయినట్లు తెలిపారు. మరమ్మతులు చేపడుతున్నామని, పనులు పూర్తి కాగానే నీటి సరఫరా పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

ఐలాపూర్‌లో ఘనంగా ఉర్సు

జాతరకు తరలి వస్తున్న భక్తులు

కోరుట్ల రూరల్, డిసెంబర్ 8: ఐలాపూర్ గ్రామంలో పూడోట మల్లన్న జాతరను పురస్కరించుకొని ఆదివారం ఉర్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దత్త పారాయణం

స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకులు

జగిత్యాల టౌన్, డిసెంబర్ 8: జిల్లా కేంద్రంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం నుంచి దత్త పారాయణం ప్రారంభమైనట్లు వేద పండితుడు తిగుళ్ల విఘ్నశర్మ తెలిపారు. దత్త పారాయణం వచ్చే ఆదివారం వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు వేణుమాధవాచార్య, ఆలయ అధ్యక్షుడు డాక్టర్ సతీశ్‌కుమార్, కిషన్‌గౌడ్, కైలాసం, సామాజిక కార్యకర్త రామచంద్రం, రవిచంద్ర, రామ్‌కిషన్‌రావు, గంగాధర్, రామకృష్ణారావు, మారుతీరావు, రాయలింగం పాల్గొన్నారు.


విన్న..నేడు..రేపు
తె